
రైతులు చేండ్లల్లకు పోతున్నరు. చిప్ప మల్లయ్య మగ్గం గుంటల కాల్లువెట్టి కదురు టక్‌టక్ మనుకుంట అటూ ఇటు తిరుగుతుంటె మగ్గం నేస్తున్నడు. కమ్మరి బక్కయ్య కొలిమంటబెట్టి కర్రులు సాగదీస్తున్నడు. వడ్ల లసుమయ్య బాడిసెతోని నాగలిదుంపను చెక్కుతున్నడు. అవుసుల బ్రహ్మయ్య సవునంతోని బంగారం ఏరి నగలు చేస్తున్నడు. తెనుగోళ్లు, బెస్తోళ్లు గాలాలు, తోపెలలు పట్టుకోని చేపలు పట్టుటానికి వాగు, చెరువు దిక్కు నడుస్తున్నరు. చిలుక రాజయ్య ఇంటిముంగట ఎండబెట్టిన ఎద్దుతోలు, చెప్పులు కుట్టే సామాన్లు సిద్ధంగున్నయి.

ఊరంత ఎవ్వరి పనులల్ల వాళ్లు లీనమవుటానికి సిద్ధమైతున్నరు. గొల్లవాడ రేపల్లె వాడోలె ఎలిగిపోతంది. అందరి ముఖాలల్ల సంబురం కనవడుతంది. అందరి ఇండ్లల్ల కవ్వంతో చల్లచిలికే సప్పుడు వినబడుతంది. గంగయ్య ఇంటిముంగటున్న పందిరి కింద నిల్చుంది రామక్క.

**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో రూ.5 వేల బహుమతి పొందిన కథ.**



''లచ్చవ్వా..! ఓ లచ్చవ్వా!!'' అని పిలిచింది.

రొండుసార్లు పిలిచినా చడీచప్పుడు లేదు.

''లచ్చవ్వా! ఓ లచ్చవ్వా!! ఏం జేత్తున్నవు? ఎంత పిల్సినా రావేంది?'' అని గట్టిగ పిలిచింది.

లచ్చవ్వ రాలేదుకని దేవునర్రలకెల్లి బైటికచ్చిండు గాలయ్య. గా పిలగాని చేతులల్ల గొర్రె పిల్లుంది.

''ఎనిమిదో తరుగతి సదివే పిల్లగానివి గొర్రెపిల్లలతోని ఆడుకుంటున్నవా బిడ్డ! మీ నాయిన్న గొర్ల కొన్నప్పట్నుంచి బాగ సంబుర పడ్తున్నట్టున్నవు గద. కులకస్పుందని సదువు బందుజేత్తవా ఏంది? గొర్ల బొక్కులంటె మస్తు ప్రేమ నీకు!''.

''గవ్వేం మాటలే రామక్క! నా కొడుకెందుకు సదువు బంజేత్తడు? ఇటు మంచిగ సదువుకుంటండు. అటు కులవృత్తి పనులు నేర్సుకుంటండు. నాలుగేండ్లాయె గద మేంగొర్లు కొని.. అప్పుడు కొన్న గొర్లు నలుపై. గిప్పుడు మా మంద వందకు పెరిగింది'' అన్నది లచ్చమ్మ.. సాయమాన్లకెల్లి అచ్చుకుంట.

''అత్తా! నువ్వు గిసోంటి మాటలు మల్లనేవు! నాకు సదువన్న.. మా కుల కస్పి పనులన్న పానమే..'' అన్నడు గాలయ్య.

''సరెగని రామక్కా.. ఎందుకో వత్తివి!'' అన్నది లచ్చమ్మ.

ఎనుకకు వెట్టుకున్న సెయ్యి ముందుకన్నది రామక్క. ఆమె చేతిల చెంబున్నది.

''సల్లకచ్చి ముంత దాసుడంటె గిదే.. సల్ల కచ్చిన్నని సెప్పలేవు! సాయమాన్ల సల్లజేత్తున్న. నువ్వు పిల్సినా వినలేదు'' అని సాయమాన్లోకి పోయింది లచ్చమ్మ.

చెంబుల సల్లదెచ్చి రామక్క చెంబుల పోసింది.

''రేపు ఆదివారం. మల్లన్న పండుగ దినం కదా! పాలు పిండం. గొర్రెబొక్కులకే ఇడిసిపెడతాం. రేపు రాకు!'' అన్నది.

''సరే!'' అంటూ వెళ్లిపోయింది రామక్క.

గొర్రెపిల్లలతోని అరుగుమీద ఆడుకుంటున్నడు గాలయ్య. తమకు గొర్లమంద వచ్చినప్పట్నుంచి పెద్దగొల్లరికం మరింత పెరిగింది. గౌరవం పెరిగింది. అటు కొంత భూమితోపాటు గొర్లమంద ఉండటం వల్ల సామాజిక గౌరవం పెరిగింది.

ఓ దిక్కు చదువుకుంటూనే.. గాలయ్య గూడ గొర్ల వెంట, పొలాల వెంట తిరుగుతూ పెరుగుతున్నడు. గట్టయ్య మామంటే తనకెంతో ఇష్టం. తమ కుటుంబంకోసం మామ రాత్రనక, పగలనక పనిజేస్తున్నడు. పెద్దమందలో తమ గొర్లను ఎట్ల ఏర్పాటు చేసుకునుడో నేర్చుకున్నడు. చెవులకున్న పెనుక (చెవికత్తిరింపు)ను బట్టి ఎవరి గొర్లను వాళ్లు ఎట్ల సాపుకుంటరో తెలుసుకున్నడు. పొలిమేరలున్న ఊరు గొర్లమందలో తమ గొర్లు కలిసినా.. వాటిని గుర్తుపడతడు. గొర్లతో కాలుకు బట్టకుండా చెట్టనక, పుట్టనక, రాయనక రప్పనక తిరుగుతున్న తనవాళ్లను చూసిండు. తోడేళ్లు, దొంగల బారినుంచి గొర్లను కాపాడుకోవడానికి వాళ్లు పడుతున్న కష్టాలను చూస్తున్నడు. చిటుకురోగమచ్చి బొంతపురుగులోలె గొర్రెలు చస్తే.. తన వాళ్లు పడుతున్న వేదన తాను అనుభవిస్తున్నడు. తను చదువుకుంటున్నా.. తనవాళ్లతోనే మమేకమై బతుకుతున్నడు. అపారమైన సాంస్కృతిక, సాంప్రదాయ సంపదను తనవి చేసుకుంటూ పెరుగుతున్నడు. కులకస్పిని, చదువును సమానంగా ప్రేమిస్తున్నడు. మూలాలు – కులకస్పి... ఈ పదాల గురించే నిత్యం ఆలోచిస్తున్నడు.

* * *

ఇరవై ఐదేండ్లు కాలగర్భంల కలిసిపోయినయి. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక విప్లవ ప్రభావంతో వచ్చిన యంత్రాల ఉపయోగం, వాటి ప్రభావం తెలంగాణలోనూ ప్రారంభమైంది. శారీరక శ్రమతో వృత్తిపనులు చేసుకునేవారి ఆదాయమార్గాలకు గండిపడటం మొదలైంది. గంగయ్యకు గొర్లుకొనిచ్చి తానే గొర్లకాపరిగా చేసి మందను పెంచిన గట్టయ్య చనిపోయిండు. ఏ దిక్కూ లేని గట్టయ్యకు గంగయ్యనే అన్నీ అయి అంత్యక్రియలు చేసిండు. గాలయ్య విద్యార్థిదశలో ఉన్నప్పటోలె కాకుండా.. గ్రామాల్లో మార్పులు శరవేగాన్ని మించి విమానవేగాన్ని అందుకున్నయి. ఊరికి కరెంటొచ్చింది. బస్సు పడింది. ఊరూరికీ బళ్లొచ్చినయి. వృత్తిపనులు ధ్వంసమవుతూ.. చాలామంది వ్యవసాయ కూలీలుగా మారారు. వ్యవసాయంలోనూ వచ్చిన సంక్షోభంతోని వలసలు పెరిగినయి. ఊరు ఇడిసిపోయేటోళ్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతంది. అన్ని గ్రామాల్లాగే ఆ ఊరు కూడా ప్రాకృతిక స్వభావాన్ని కోల్పోయి.. కృత్రిమత్వాన్ని అలుముకునే స్థితికొస్తున్నది.

ఈ పాతికేళ్ల కాలంల గాలయ్య ఎం.ఏ సోషియాలజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిండు. ప్రొఫెసర్ స్థాయికెదిగిండు. కానీ, ఊరిని.. కుటుంబాన్ని.. తన మూలాలను మరిచి ఉండలేదు. హైదరాబాద్‌లో ఉంటున్నా కరీంనగర్ జిల్లాలున్న తన ఊరితోని సజీవ సంబంధాలు పెట్టుకొనే ఉన్నడు. గ్రామాల్లో వస్తున్న మార్పులను గమనిస్తున్నడు. కులకస్పి ఉండాలని తండ్రితో గొర్లు కొనిపించిన గట్టయ్యను, తండ్రి పెద్దగొల్లరికాన్ని మరిచిపోలేక పోతున్నడు. ఏ స్థితిలో ఉన్నా అవే ఆలోచనలు.

తెలంగాణ గ్రామాలల్ల భూపోరాట ఉద్యమాలు బాగా జరుగుతున్న కాలం. ప్రపంచీకరణ ప్రభావం అప్పుడప్పుడే గ్రామాలకూ విస్తరిస్తున్న సందర్భం. తండ్రి సంవత్సరీకానికి ఊళ్లోకొచ్చిన గాలయ్య మిత్రుడు రమణయ్యతో కలిసి ఊరంతా తిరిగి చూస్తున్నడు. ఊరుమ్మడి స్థలంగా ఉండే కమ్మరి కొలిమి దగ్గర జనం లేరు. కుమ్మరిసారె తిరగడం లేదు. చాకలి బాలయ్య పెళ్లి పల్లకి విరిగిపోయింది. అవుసులోళ్ల కుంపటి నుంచి అగ్గి రాజుకుంట లేదు. సాలెల మగ్గం మూలకు పడింది. కత్తెర్లోళ్ల పశువుల మంద జాడ కనిపిస్తలేదు. వడ్లధాతి బోసిపోయింది. గొల్లలిండ్లలో కవ్వం చప్పుళ్లు లేవు. చాలా వ్యవసాయాలు మూలకుపడ్డయి. వృత్తి పనులన్నీ సంక్షోభంల పడ్డయి. ఊళ్లెకు జానపద యాచక కులాలోళ్లు రావడం తగ్గినట్టుంది.

ఊరంతా తిరిగొచ్చి మంచంల కూర్చున్నడు